
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 22.6

ANDHRAJYOTHY



నల్లగొండ

3 మంగళవారం 19 నవంబరు 2024



సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

సమగ్ర సర్వేపై అపోహలు సరికాదు

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ● జిల్లా కేంద్రంలో బహిరంగ విచారణ ● పాల్గొన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు



నల్లగొండ జిల్లాకేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు, చిత్రంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు

కోటిపై చిలుకు కుటుంబాలను గుర్తించాం

సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను గుర్తించాం. సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న వారిని లెక్కిస్తే అందరికీ న్యాయం జరుగుతుంది.

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

5

యాదగిరిగుట్టలో
కార్తీక సందడి

యాదగిరీశుడి క్షేత్రంలో సోమవారం కార్తీక పూజలు వైభవంగా కొనసాగాయి. కొండకింద వ్రత మండపంలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన 764 జంటలు వ్రతాలు ఆచరించాయి. కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, వైకుంఠద్వారం కొండపైన ఉత్తర రాజగోపురం ఎదురుగా, శివాలయం వద్ద దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేసిన దీపారాధన మండపాల వద్ద మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. శివాలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, దేవస్థానం ఆధ్వర్యంలో సంధ్యవేళ శివలింగం, ఓం ఆకారంలో భక్తులు దీపా రాధనలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

5

న్యూస్ బాక్స్

సమస్యల పరిష్కారం కోసమే
ప్రతీవారం గ్రీవెన్స్‌డే
ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 32మంది బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలిగి బాధితులకు వేగంగా న్యాయం అందేలా చూడాలన్నారు.

చెర్వుగట్టులో
భక్తుల సందడి



కార్తీక దీపాలను వదులుతున్న మహిళలు

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం కావడంతో మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్త జన సందోహం కన్పించింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి పంచామృతాభిషేకాలు చేశారు. సామూహిక సత్యదేవుడి వ్రతాలను ఆచరించారు. సాయంత్రం పుష్కరిణిలో కార్తీక దీపాలను వెలిగించి గంగమ్మకు హారతి ఇచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.


ఏం సాధించారు?
ఏ హామీ నిలబెట్టుకున్నారు?
బడుగుల లింగయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్యయాదవ్

కొండమల్లేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో ఏం సాధించిందో? ఏ హామీ నిలబెట్టుకుందో? చెప్పాలని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలనాపరంగా పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను తప్పడమే గాక, ప్రతీ మహిళకు రూ.2500 చొప్పున ఇస్తామని, పింఛన్లు పెంచుతామని మోసం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు గుండెబోయిన లింగంయాదవ్, పెద్దిశెట్టి సత్యనారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.

డీ-49 కాల్వల్లోకి
ఏఎమ్మార్పీ నీరు



డీ-49 కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కేతేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు కృష్ణానది నీరు చేరింది. అయిటిపాముల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు ఎత్తి వారం రోజుల క్రితం దిగువకు అధికారులు నీటిని విడుదలచేశారు. కాగా, రెండు రోజులుగా, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ద్వారా మండల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో నీరు ప్రవహిస్తోంది. దీంతో డీ-49 పరిధిలోని కొర్లపహాడ్, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి గ్రామాల రైతులు యాసంగి నాట్లకు భూములను సిద్ధం చేస్తున్నారు. అంతేగాక ఆయా గ్రామాల చెరువులు, కుంటలు నిండనున్నాయి.



సాదాబైనామా సృష్టించి
రికార్డులు మార్చి

● రెవెన్యూ అధికారుల లీలలు

- పక్కన భూమిలో కలిపి తప్పుడు రిజిస్ట్రేషన్
- గుట్టకింద అన్నారంలో 18 గుంటల భూమి అక్రమంగా అప్పగింత
- తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగుల సహకారం!
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు
- విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ధరణి వెబ్‌సైట్‌లో రికార్డుల నమోదు సందర్భంగా అధికారులు, ఉద్యోగులు చేసిన తప్పిదాలు ఒక్కోటిగా వెలుగులోకి వస్తున్నాయి. బాధితులు ఫిర్యాదులు చేస్తుండడంతో ధరణిలో రికార్డుల అప్‌డేషన్‌లో జరిగిన అక్రమాలు, ఉద్యోగుల చేతివాటం బయట పడుతోంది. తాజాగా నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం జీకే అన్నారంలో సాదాబైనామా డాక్యుమెంట్ ఆధారంగా భూ యజమానురాలికి సంబంధం లేకుండానే ఆమె తన భూమిని విక్రయించినట్టుగా 13-బీ ఫారం ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెరపైకి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో కలిసి సాదాబైనామా సృష్టించిన వ్యక్తి భూమిని అతడి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ప్రలోభాలకు లొంగి తనకు అన్యాయం చేశారని బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

తప్పుడు సాదాబైనామా సృష్టించారు

నేను 2008లో మా నాన్న భూమిని కొనుగోలు చేశా. ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పాత ప్రభుత్వపు పట్టాదారు పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్ ఉన్నాయి. ధరణిలోనూ మా భూమి వివరాలు అప్‌డేట్ చేసి పాస్‌బుక్ ఇచ్చారు. అయితే 18 గుంటల భూమిని మేం విక్రయించకున్నా, నాకు సంబంధం లేకుండానే సత్తిరెడ్డి అనే వ్యక్తికి విక్రయించినట్టు ఫేక్ సాదాబైనామా సృష్టించి 31-బీ ద్వారా అతడికి రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో భూవిక్రయదారులు, కొనుగోలుదారులుంటేనే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ, నాకు సంబంధం లేకుండానే భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌కు తహసీల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సహకరించడం వల్లే నాకు అన్యాయం జరిగింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ విచారణ చేయించి న్యాయం చేయాలి.

పురం స్వరూప, గుట్టకింద అన్నారం

పక్కభూమిలో కలిపి రిజిస్ట్రేషన్

నల్లగొండ మండలం గుట్టకింద అన్నారం గ్రామంలో పురం స్వరూపకు సర్వే నెంబర్లు 44/ఆలో 18 గుంటలు, 65/ఈలో 26 గుంటలు, 66/ఈలో 4 గుంటలు, 67/ఈలో 3 గుంటలు కలిపి మొత్తం 1.11 ఎకరాల భూమి ఉంది. ఆమె ఈ భూమిని తండ్రి బోధనం నర్సిరెడ్డి నుంచి 31 మే 2008న కొనుగోలు చేసింది. అప్పటి ప్రభుత్వం అందజేసిన పట్టాదారు మిగతా 6వ పేజీలో...

యాదగిరీశుడి బాలాలయ..
ఖాళీ స్థలంపై కన్ను

దుకాణాల నిర్మాణానికి అనుమతివ్వాలని వర్తకుల వినతి



యాదగిరికొండపైన బాలాలయం ఏర్పాటు చేసిన స్థలం

భువనగిరి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):యాదగిరీశుడి బాలాలయ ఖాళీ స్థలంపై అందరి దృష్టి పడింది. ప్రధానాలయం ప్రారంభానికి ముందు బాలాలయం ఏర్పాటు చేసిన ప్రదేశం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. ఇక్కడ కల్యాణ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు 2023 ఆగస్టు 21న వైటీడీఏ వైస్ చైర్మన్ జీ.కిషన్‌రావు, మైహోమ్ రామేశ్వరరావుతో కలిసి చిన్న జీయర్ స్వామి పూజలు చేశారు. అదేరోజు దివ్య విమాన రాజగోపురం తాపడం పనులకోసం(రామేశ్వరరావు) ఐదు కిలోల బంగారం కూడా సమర్పించారు. భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు గతేడాది అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం చినజీయర్ ప్రకటించారు. నిత్య కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఇరుకుగా ఉండటంతో ఖాళీ ప్రదేశంలో కల్యాణమండపం, ధ్యాన మందిరాలను మైహోమ్ రామేశ్వరరావు దాతృత్వంతో నిర్మిస్తారని జీయర్ స్వామి స్పష్టంచేశారు. కానీ, ఈలోపు ప్రభుత్వం మారడంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతికోసం ఇక్కడి అధికారులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఫెన్సింగ్ వేసిన ఆ స్థలంపై వర్తకులు కన్నేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఈ నెల 8న మంత్రులు, వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇక్కడ చేపట్టాల్సిన నిర్మాణాలను సీఎం మిగతా 5వ పేజీలో

గ్రూపు-3కి 53శాతం హాజరు



కాకతీయ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

నల్లగొండ, నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-3 పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో 88 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 28,353 మంది అభ్యర్థులకు 15,257 మంది హాజరయ్యారు. 13,096 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 53.81శాతం మంది అభ్యర్థులు పరీక్ష రాశారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కాగా, పట్టణంలోని కాకతీయ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తనిఖీచేసి పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం, సోమవారం బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ డానియల్, తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

బెడిసికొట్టిన
'బంపర్' ఐడియా

● కారు వెనుక భాగంలో బంపర్ మధ్యలో గంజాయి ప్యాకెట్లు

● రెండు కేసుల్లో ఏడుగురు ముఠాసభ్యుల అరెస్టు

5

రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం



మాడ్గులపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

మాడ్గులపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లయ్స్ అధికారి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి జి.వెంకటేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యంలో నిబంధనల మేరకు తేమశాతం ఉంటే వెంటనే కాంటాలు వేయాలన్నారు. కాంటా వేసిన రైతులకు వెంటనే డబ్బు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఐ బి.పాండరి, ఎస్ఐ శ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ డీటీ జావిద్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఆర్ రజిత, కార్యదర్శి రవీందర్‌రావు, ఇన్‌చార్జి నాగరాజు, యోగిరాజు, తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి, మర్రిగూడ, కొండమల్లేపల్లి): ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి ఉమ్మడి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు, ఘనపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నాంపల్లి మండలం చిట్టెంపాడు, గట్లమల్లేపల్లి, నాంపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాలను, కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన డబ్బు చెల్లింపు కోసం ట్యాబ్‌లో వెనువెంటనే వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఆయన వెంట దేవరకొండ సివిల్ సప్లయ్స్ అధికారి శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ సిబ్బంది ప్రభాకర్, మహేష్, సైదులు, డీటీసీఎస్‌వో హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, సీఈవో తిరుపతిరెడ్డి, ఏఈవో మల్లేష్, మానిటరింగ్ అధికారి ఐతులు, తదితరులు ఉన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి



సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో డిసెంబరు 1న నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ తల్లమళ్ల హసేన్, జిల్లా చైర్మన్ గోలి సైదులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సింహగర్జనకు మాలలు ఇంటికి ఒకరు చొప్పున, గ్రామానికి వాహనం చొప్పున తరలి వచ్చి సత్తా చూపించాలన్నారు. ఆర్టికల్ 341ని సవరించకుండా వర్గీకరణ చేయవద్దన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలలో ఎస్సీ వర్గీకరణ చేసే ఆ పార్టీకి దమ్ముందా అని ప్రశ్నించారు. మనువాద రాజకీయ పార్టీలు ఎస్సీ కులాలను విడదీస్తూ ప్రైవేట్ రంగాన్ని తెరపైకి తెస్తూ ఉద్యోగాలు, రిజర్వేషన్లను తీసి వేసేందుకు మందకృష్ణను పావుగా వాడుతున్నాయన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు సింహగర్జనకు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు కంచి మధుసూదన్, రేకల సైదులు, భోగరి విజయ్, చింతపల్లి లింగమయ్య, తెలగమల్ల యాదగిరి, గాలి రవికిషన్, కట్ట దుర్గా ప్రసాద్, సంద యాదయ్య, ఈసారపు కృష్ణమూర్తి, అద్దంకి రామకోటి, ఏడిండ్ల అశోక్, బొల్లెద్దు గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం



వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలోని ఓ సన్నివేశం

నల్లగొండ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో ప్రదర్శించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇంద్రకుమార్, హేమ మానస, పూర్ణేష్, అజయ్‌కుమార్ ప్రధాన పాత్రధారులుగా వీరబ్రహ్మేంద స్వామి చరిత్రను ప్రదర్శించారు. కడపకు చెందిన విజయనాట్య మండలి సురభి సంస్థ కళాకారులు సుమారు 3గంటల పాటు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారులను విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణ కౌండిన్య, దాసోజు శ్రీనివాస్, పెందోట సోము, సాగర్ల సత్తయ్య, మధుసూదన్, కొండూరు కృష్ణమాచారి, బ్రహ్మచారి, యాదగిరి, సత్యం, పర్వతం నరేంద్రబాబు, యాదగిరి, సత్యం, జగన్నాథం, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక చింతన ఎక్కువే

ప్రజాసేవలో ఎంత బిజీగా ఉన్నా, ప్రజాప్రతినిధులుగా ఎన్ని పనులు ఉన్నా జిల్లాకు చెందిన పలువురు నేతలు ఆధ్యాత్మిక చింతనను మాత్రం విడవడం లేదు. కొందరు పూజా కార్యక్రమాల తర్వాతే తమ దినచర్యలను ప్రారంభిస్తున్నారు. మరికొందరు ఎక్కడైనా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తప్పక హాజరవుతుంటారు. ఇలవెల్పులుగా కొలుస్తూ తమ ఇష్టకార్యాలకు ముందుగా ఇష్టదైవాలకు నివేదించి వస్తుంటారు. ఎన్నికల్లో నామినేషన్‌కు ముందు, విజయం సాధించాక ఇష్టదైవాలను దర్శిస్తుంటారు. వివిధ ఆలయాలను దర్శించుకుంటూనే, ఆలయాల నిర్మాణానికి ఇతోధికంగా సాయం అందిస్తున్నారు.

● దైవచింతనలో ప్రజాప్రతినిధులు ● నిత్యం దేవుడి స్మరణతో పనులు ప్రారంభం ● ఆలయాల నిర్మాణాలకు విరాళాలు ● వీలుచిక్కితే పుణ్యక్షేత్రాల సందర్శన

మహాశివరాత్రికి మేళ్లచెర్వుకు మంత్రి ఉత్తమ్ ఆనవాయితీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువే. మంత్రి ఉత్తమ్, ఆయన సతీమణి పద్మావతి ఇద్దరూ కలిసి ప్రతీ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా మేళ్లచెర్వులోని శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. దశాబ్దాల నుంచి అక్కడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ ప్రభను ప్రారంభిస్తుంటారు. దీంతో పాటుగా హుజూర్‌నగర్ పట్టణంలో రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పిలిచే ముత్యాలమ్మ జాతరలో పాల్గొంటారు. జాతర మొదటిరోజు ఉదయం లేదా సాయంత్రం వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో అతిపెద్ద జాతరలుగా పిలిచే ఈ రెండు పండుగలకు మంత్రి ఉత్తమ్ అధిక ప్రాధాన్యమిస్తారు. తిరుమల క్షేత్రాన్ని మంత్రి ఉత్తమ్, పద్మావతి దంపతులు ఏడాదికి ఒకసారి, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని సిక్కుల దేవాలయాన్ని ఉత్తమ్ దర్శించుకుంటారు. ఇటీవల నాందేడ్‌లోని సిక్కుల దేవాలయాన్ని ఉత్తమ్ దర్శించుకున్నారు. దేశంలో ఏదైనా పర్యటనలకు వెళ్లిన సమయంలో అక్కడి ప్రాముఖ్యత కలిగిన దేవాలయాలను సందర్శించుకోవడం ఉత్తమ్ ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. హుజూర్‌నగర్‌లో గత ఏడాది నూతన గృహ ప్రవేశం సందర్భంగా రెండురోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు.



మేళ్లచెర్వు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్తమ్(ఫైల్)

అయిలయ్య ఇంటి దైవం శ్రీవీరభద్రస్వామి

యాదగిరిగుట్ట రూరల్ : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆధ్యాత్మికతకు ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుంటారు. ఆయన స్వగ్రామం యాదగిరిగుట్ట మండలం సైదాపురం. గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆయన ఇంటి దైవం. 2000 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం 20 ఏళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. కాగా అయిలయ్య ఎమ్మెల్యే కాక ముందు నుంచి ఆలయానికి ప్రత్యేకంగా సోమవారం, పౌర్ణమి, ప్రత్యేక రోజుల్లో కుటుంబ సమేతంగా వెళ్లి స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు. సమయం చిక్కినప్పుడు శ్రీవీరభద్రస్వామి ఆలయానికి తప్పకుండా వెళ్లి గంటల తరబడి అక్కడే ఉంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు ముందు వీరభద్రస్వామి ఆలయంలోనే ప్రత్యేక పూజల్లో పాల్గొని నామినేషన్ వేశారు. స్వామి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు ఆయనకు ఎంతో నమ్మకం. ఆలయం ప్రాంగణంలో అభివృద్ధికి నిధులు సైతం కేటాయించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రతీ సోమవారం ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ప్రాంతంలో యువత పెడదారిన పట్టకుండ భక్తుభావం పెంపొందించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సైతం అనేక సేవలు అందిస్తున్నారు.



సైదాపురం గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అయిలయ్య కుటుంబ సభ్యులు

పుణ్యక్షేత్రాల సందర్శనలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి తరుచూ తిరుపతి, శ్రీశైలం, యాదగిరిగుట్ట వంటి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంటారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో 100కు పైగా దేవాలయాలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు. గ్రామాల్లో జరిగే బ్రహ్మోత్సవాలు, జాతరల్లో పాల్గొంటుంటారు. అదేవిధంగా తన తల్లి సుశీలమ్మ పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



దేవాలయాల అభివృద్ధిలో బాలునాయక్

దేవరకొండ : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూనే దేవాలయాలను సందర్శించి పూజలు చేస్తు భక్తిని చాటుకుంటున్నారు. గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమునిగల్‌లోని తుల్జాభవాని దేవాలయానికి వెళ్లి తరచుగా పూజలు చేస్తుంటారు. దీంతో పాటు స్వగ్రామం ముదిగొండ వీరభద్రస్వామి దేవాలయ జాతర సమయంతో పాటు తరచుగా వెళ్లి దైవదర్శనం చేసుకుంటారు. కార్తీకమాసం కావడంతో అయ్యప్పస్వామి దేవాలయాన్ని, దేవరకొండ మండలం పాల్తీరాంతండాలో సత్తిమారమ్మ యాడి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. దేవాలయాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తూ దైవభక్తిని చాటుకుంటున్నారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని బాలునాయక్ అన్నారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

దైవభక్తిని చాటుకుంటున్న ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ మునిసిపల్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహకు దైవ చింతన ఎక్కువ. దేవరకొండ గరుడాద్రి వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తున్నారు. రూ.8లక్షలు దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. సాయిబాబా దేవాలయం, అయ్యప్పస్వామి, వాసవీకన్యకాపరమేశ్వరి, రామాలయాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తు పూజల్లో పాల్గొంటుంటారు. ఒకవైపు మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తునే కార్తీకమాసం కావడంతో ఉదయానే దైవదర్శనాలు చేసుకుంటుంటారు.



పెద్దమునిగల్ తుల్జాభవాని అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవుడికి మొక్కుకుని దినచర్య మొదలు

ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం): మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్‌ప్రతి రోజూ దేవుడికి మొక్కుకోనిదే బయటకు కూడా వెళ్లరు. షిర్డీసాయిబాబా అంటే ఎంతో భక్తి. ఆ నేపథ్యంలో ఆయన స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం పారుపల్లిలో సొంత నిధులతో సాయిబాబా ఆలయాన్ని నిర్మించారు. సమయం దొరికినప్పుడు మనశ్శాంతి, ప్రశాంతత కోసం పుణ్యక్షేత్రాలను దర్శిస్తుంటారు. ప్రతి ఏటా శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, అన్న ప్రసాద వితరణ చేస్తుంటారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో వివిధ దేవాలయాల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించారు.

నాకు భక్తి భావం ఎక్కువ: భిక్షమయ్యగౌడ్

తనకు భక్తి భావం ఎక్కువేనని, ఎన్ని పనులున్నా, ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ దేవుడికి మొక్కుకుని రోజు వారి పనులు ప్రారంభిస్తానని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. అందరి దేవుళ్లను మొక్కుతానని, ముఖ్యంగా తమ కుల దైవం కంఠమహేశ్వరునితో పాటు శ్రీశ్రీషిర్డీసాయిబాబా, శివుడు, లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటానన్నారు.



పారుపల్లిలో భిక్షమయ్యగౌడ్ నిర్మించిన సాయిబాబా గుడి



శివపూజలో భిక్షమయ్యగౌడ్, సువర్ణ దంపతులు

సంకల్పంగా గుడి కట్టించి...

చిట్యాలరూరల్: నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు కృష్ణారెడ్డి దేవుళ్ల పట్ల అమితమైన భక్తిభావాలు ఉన్నాయి. స్వగ్రామం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో పురాతన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని తండ్రి కంచర్ల చినమల్లారెడ్డి జ్ఞాపకార్థం వారు పునర్నిర్మించారు. కంచికామకోటి పీఠాధిపతి జయేంద్రసరస్వతితో ప్రారంభోత్సవం చేయించారు. ఆలయ నిర్వాహణను భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి చూసుకుంటారు. తరుచూ స్వగ్రామంలో సొంత ఖర్చుతో నిర్మించిన శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పూజలను నిర్వహిస్తారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన సమయంలోనూ శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. టికెట్ వచ్చిక స్వామి వారి ఆశీస్సులు పొంది విజయం సాధించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆధ్యాత్మికచింతన భక్తిభావంతో ఆలయాలను తరుచూ దర్శిస్తుంటారు.





ఎక్కడున్నా శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుంటా

ఎన్ని పనులున్నా ఉరుమడ్లలోని శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్తానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. స్వామి సంకల్పంతోనే గుడిని నిర్మించామని, రూ.కోటికి పైగా వెచ్చించామన్నారు. శ్రీరామలింగేశ్వరుడి ప్రతిమను ప్రత్యేకంగా కాశీ నుంచి తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఆలయాన్ని నిర్మించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఏ పనిచేసినా స్వామి ఆశీస్సులను తీసుకునేందుకు ఆలయానికి వెళ్తామన్నారు. పుట్టిన రోజున స్వామి వారిని తప్పక దర్శించుకుంటానన్నారు.

ఉమ్మడి జిల్లా మల్కంబ్ క్రీడా జట్ల ఎంపిక



మల్కంబ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో క్రీడా నిర్వాహకులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా మల్కంబ్ పోటీలకు జట్ల ఎంపిక పూర్తయ్యింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రీనిటీ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-14, 17, 19 జట్లకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-14 కేటగిరి జట్టుకు అక్షిత, చిత్రాక్షి, వైష్ణవి, సాన్విత, మోక్షిత, సంస్కృతి, మణి, సాత్విక్, శ్రీగణేష్, రాధేశ్యామ్, చరణ్ సాయి, కరణ్ ఎంపికయ్యారు. అండర్-17 కేటగిరి జట్టుకు లోహిత, నీరజ, సాత్విక, కీర్తి, వైష్ణవి, ప్రీతి చరణ్య, శ్రీహర్ష, గణేష్, గణేశ్వర్, దీక్షిత్, దిలీప్, మణిదీప్ ఎంపికయ్యారు. అండర్-19 కేటగిరి జట్టుకు దిశ, సహస్ర, హారిక, జ్ఞానశ్రీ, లాస్య, అక్షిత, హేమంత్, సాయి శశాంక్, అభినవ్, అనీష్, విశాల్, భార్గవ్ ఎంపికయ్యారు. ఒక్కో జట్టుకు 12మంది చొప్పున విద్యార్థులను ఎంపికచేశారు. ఈ జట్ల ఎంపికలో మండల విద్యాధికారి గురువారావు, క్రీడల పరిశీలకుడు వీ బిక్కు, పంతంగి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ట్రీనిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.





విన్యాసాలు ప్రదర్శిస్తున్న బాల, బాలికలు

జాతీయ స్థాయి కరాటే పోటీలకు శివశంకర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి కరాటే పోటీలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ క్రీడాకారుడు శివశంకర్ ఎంపికయ్యారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు. ఖమ్మంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో శివశంకర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. డిసెంబరు చివరి వారంలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. శివశంకర్‌ను సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర అభినందించారు. కార్యక్రమంలో కోచ్ పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



శివశంకర్‌ను అభినందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర

తైక్వాండోలో దేవేంద్రనాథ్‌కు కాంస్యం

దామరచర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) :తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాల 3వ తరగతి విద్యార్థి గోలి దేవేంద్రనాథ్ క్యాంస పతకం సాధించాడు. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లోని బాలయోగి ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన అండర్-21 కిలోల కేటగిరిలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా దేవేంద్రనాథ్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడలో అభినందించారు. మున్ముందు అనేక పతకాలు సాధించాలని విద్యార్థికి సూచించారు.



దేవేంద్రనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు అనిల్

నాగార్జునసాగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఖోఖో పోటీలకు నాగార్జునసాగర్ టీసీ గురుకుల కళాశాల విద్యార్థి అనిల్ ఎంపికయ్యారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో అనిల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో అనిల్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనిల్‌ను సోమవారం అధ్యాపకులు అభినందించారు.



అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

సాహిత్యం, లలిత కళల్లో విజేతలుగా సెయింట్ ఆన్స్ విద్యార్థులు

మఠంపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు సీఎస్ఏ పాఠశాలలకు నిర్వహించిన సాహిత్యం, లలిత కళల పోటీల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన సెయింట్స్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరిలోని నిర్మల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు వివిధ కేటగిరిలో బహుమతులను సాధించారు. పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని శృతి హాసిని మొదటి బహుమతి, వాక్చాతుర్యంలో ఇంగ్లీష్, హిందీ, తెలుగులో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను హేమంత్, ఎస్‌కే యాస్మిన్, మొయినుద్దీన్, రుచిత ప్రియ, మహాలక్ష్మీ, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ ఇంగ్లీష్‌లో జగన్మోహన్‌రెడ్డి రెండో బహుమతి, ఫాదర్ పాస్క్వాల్ గారి ప్రతిమ నమూనా తయారీలో ఎన్.జీన్, మనోజ్ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత, కరస్పాండెంట్ సిస్టర్ జాక్విలిన్ రూబీ, సిస్టర్ మార్గరెట్, పీఈటీ ముక్కంటి, టీచర్లు స్వర్ణ, మాధురి, శ్రీను, రవళిక, ప్రసన్న, మహేశ్వరీ, మౌలాలి అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం సందడి



మేళ్లచెర్వులో ప్రత్యేక అలంకరణలో భద్రాది సమేత భావనరుషి స్వామి వారు



మేళ్లచెర్వు శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

మేళ్లచెర్వు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి వారి ఆలయ వద్ద వేకువజామున నుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకాల అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి, శంభిరెడ్డి, ఈవో కొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, కొండారెడ్డి, చందర్‌రావు, ఆలయ అర్చకులు, విష్ణవర్ధన్ శర్మ, ధనుంజయ శర్మలు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ, జీవధ్వజ ప్రతిష్ఠ

మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారు ఆలయ ప్రాంగణంలో సోమవారం మార్కండేయ సహిత భద్రావతి భావన రుషి విగ్రహ, జీవ ద్వజ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చండీపీఠ ఉపాసకులు కొంకపాక రాధాకృష్ణ మూర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వలకటి రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు రంగారావు, గణేష్, సాయికుమార్, మధు, కొండలు, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణమ్మకు మంగళ హారతి

మఠంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుని క్షేత్రంలో కార్తీకమాసం సోమవారం సందర్భంగా కృష్ణానదికి మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు, అభిషేకాలు, సార చీర సమర్పించి, దీపాధనలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో కృష్ణమ్మకు మంగళ హారతి ఇచ్చి భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాశివునికి అభిషేకం

వలిగొండ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి ఆలయంలో మరకత శివలింగానికి ప్రత్యేక పూజలు జరిపారు. పంచామృతాలతో అభిషేకించారు. మహాశివుడు అర్ధనార్వీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాదేవుడికి ప్రీతికరమైన బిల్వపత్రాలు పలు పుష్పాలతో కొలిచారు. మండల వ్యాప్తంగా ఉన్న శైవాక్షేత్రలలో భక్తులు అర్చనలు నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు జరిగాయి. సాయంత్రం శివాలయ ధ్వజస్తంభం ముందు శాస్త్రోక్తంగా కార్తీకదీపాన్ని అర్చకులు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు రాకేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వలిగొండలో అర్ధనారీశ్వర అలంకరణలో మహాశివుడు

వైభవంగా పంబారట్టు మహోత్సవం

గరిడేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో అయ్యప్పస్వామి దేవాలయంలో దివిటోస్ పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో సోమవారం తొమ్మిదవ మహా పడిపూజ, పంబారట్టు మహోత్సవం వైభవంగా జరిగింది.ఉదయం గణపతి హోమం, విఘ్నేశ్వరపూ, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. జ్యోతులతో గ్రామ సంకీర్తనలతో మేళతాళాలతో స్వామి వారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. గ్రామశివారులోని చెరువులో ఉత్సవ విగ్రహానికి నదీ పంచామృతాభిషేకాలతో పంబాఆరట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు యడవెల్లి వెంకటరెడ్డి, వీరమల్ల రమేష్, మండాది ఆంజనేయులు, బండ నర్సిరెడ్డి, గ్రామ పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రీ, సుదర్శన్ వరదరాజన్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చెరువులో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



సమగ్ర సర్వేపై అపోహలు సరికాదు

● బీసీలు ఎంతమంది ఉన్నారో తెలిస్తేనే వారికి అవకాశాలు ● తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ● వెనకబడిన తరగతుల సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులపై నల్లగొండలో బహిరంగ విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని, సర్వేపై అపోహలు సృష్టించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో బీసీ కమిషన్ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తోందన్నారు. ఇప్పటివరకు ఐదు విచారణలు పూర్తి చేయగా, ఇది 6వ దని తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు ఆయా జిల్లాల్లో కమిషన్ బహిరంగ విచారణలు కొనసాగుతాయని చెప్పారు. బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగితే చర్యలు తీసుకునేందుకు బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చరిత్రాత్మక నిర్ణయమని, దీనివల్ల రాష్ట్రంలో జనాభాలో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను గుర్తించారని, ఇందులో 87వేల మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని, సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న వారు ఎంత మందో తెలిస్తే మంచి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇప్పటివరకు 65శాతం నుంచి 70శాతం సర్వే పూర్తయిందని, నల్లగొండ జిల్లాలో 5లక్షల4542మంది కుటుంబాలకు ఇప్పటివరకు 4,20,954 కుటుంబాలను సర్వే చేసి 84శాతం సర్వే పూర్తి చేయడం పట్ల అభినందించారు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో సైతం సర్వే మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలు మాట్లాడారు. ఈ సమవేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిజాం అలీ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల బీసీ సంక్షేమ అధికారులు అనసూయ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాలు, సంస్థల నుంచి వినతిపత్రాల స్వీకరణ

బహిరంగ విచారణ సందర్భంగా విశ్వకర్మ, బ్రాహ్మణ, పూసల, రజక, కుమ్మర, కమ్మరి, ఉప్పర అన్ని కుల సంఘాలు మజ్లిస్, జమైతే ఇస్లాం ఇతర సంఘాల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీ కమిషన్ బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్‌లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, నాయీ బ్రాహ్మణులను ఆలయాల్లో ఉద్యోగులుగా గుర్తించాలని, బెస్తలను బీసీ ఏ నుండి ఎస్టీకి మార్చాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, భట్రాజ్ తదితర కులాలను బీసీడీ నుంచి ఏ కు మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆ పేరు పిలవడం మానేసి వంశరాజ్‌గా మాత్రమే పిలవాలని విజ్ఞాపనలు వచ్చాయని అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

బీసీల స్థితిగతులు తెలుసుకునేందుకే సర్వే



బీసీల స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక ఉపాధి రాజకీయ కుల గణన తలపెట్టింది. అనాది కాలం నుంచీ బీసీలు వివక్షకు గురవుతున్నారు. కుల వృత్తుల వారు ఇబ్బంది పడుతున్నారు. కొంతలో కొంత మార్పు వచ్చినప్పటికీ ఇంకా మార్పురావాల్సిన అవసరముంది. కులవృత్తుల వారు కులాలు చేయడం లేదు, దీంతో వారు ఉపాధి కోల్పోతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని బీసీల అభ్యున్నతికి బీసీ కమిషన్ కృషిచేయాలి.

● కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే.

విచారణకు అన్ని సౌకర్యాలు కల్పించాం



బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం. ప్రత్యేకించి అఫిడవిట్ ఏర్పాటు చేయడంతో పాటు, జిరాక్స్, అన్ని సౌకర్యాలు కల్పించాం.

● ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్.

సద్వినియోగం చేసుకోవాలి



బీసీ కులాలు, ఉపకులాల సమస్యలు విని పరిష్కరించేందుకు ఇప్పటివరకు బీసీ కమిషన్ ఐదు జిల్లాల్లో పర్యటించింది. వివిధ సంఘాలు, సభ్యులు, వ్యక్తులందరికీ కమిషన్ అవకాశం కల్పిస్తుంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

● హనుమంతరావు, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్.

బీసీల సమస్యలు తెలుసుకోవడం సంతోషకరం



బీసీ కమిషన్ ప్రజల వద్దకు వెళ్లి బీసీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయడం చాలా సంతోషకరం. బీసీ కమిషన్ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలి. కమిషన్‌కు సమస్యలు విన్నవించుకోవాలి.

● తేజస్ నందలాల్ పవర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.122	190	220
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.120	174	194



సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.70
టీఎంసీలు	296.5695
ఎడమకాల్వకు నీటి విడుదల	5,438
కుడికాల్వకు	10,000
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	18,138 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.25 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	500
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.40 అడుగులు
టీఎంసీలు	4.33
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	67.12 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	376.07 క్యూసెక్కులు

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై పీడీయాక్ట్

సూర్యాపేటక్రైం, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదైంది. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన పసుపుల నర్సింహ్మారావు, ఆత్మకూర్ జగదీష్ కొంతకాలంగా జిల్లాలో రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జూలైలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా కోదాడ రూరల్ పోలీసులు వారిని పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణా, నిల్వ చేసినందుకు మొత్తం 14మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సుమారు 32.5టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసు కాకుండా గతంలో కూడా నర్సింహ్మారావుపై మూడు కేసులు, జగదీష్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు ఇద్దరిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయడానికి సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, పీడీ యాక్ట్ అమలు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను చెంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు. రేషన్ బియ్యంతో వ్యాపారం చేసినా, ప్రజా ఆహార భద్రతకు భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బొలేరు వాహనాన్ని ఢీ కొట్టి దెబ్బతిన్న కారు

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాల్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రం శివారు కామినేని ఆసుపత్రి ఎదురుగా ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి జరిగింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... చౌటుప్పల్‌కు చెందిన గుర్రం బాలరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి నకిరేకల్‌లోని బంధువుల ఇంటికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా కామినేని ఎదురుగా టైరు పంక్చర్ అయింది. ఆగిఉన్న బొలేరో వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కామినేని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చెరువు వద్ద కాపలాకు వెళ్లి..

అడ్డగూడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చెరువు వద్ద కాపలాకు వెళ్లిన మత్స్యకారుడు అనుమానాదస్పదస్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన యాద్రాదిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ఆజీంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లబోయిన శ్రీను(49) రోజు మాదిరిగానే మాదాసు వెంకన్న, నర్సింహతో కలిసి శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో చెరువు వద్దకు కాపలాకు వెళ్లి రాత్రి అక్కడే రాత్రి వారు అక్కడే నిద్రించారు. 16వ తేదీ శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో మాదాసు వెంకన్న, నర్సింహ శ్రీనును లేపగా ఎంతకూ లేవకపోవడంతో వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచానామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీను మృతిపై అనుమానం ఉందని తల్లి ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

యాదగిరిగుట్టలో కార్తీక సందడి



ఓం ఆకారంలో దీపారాధన చేస్తున్న భక్తులు



నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కార్తీక మాసం వ్రత పూజలు సోమవారం వైభవంగా కొనసాగాయి. కొండకింద వ్రత మండపంలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన 764మంది జంటలు వ్రతాలు ఆచరించాయి. కాగా, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, వైకుంఠద్వారం కొండపైన ఉత్తర రాజగోపురం ఎదురుగా, శివాలయం వద్ద దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేసిన దీపారాధన మండపాల వద్ద మహిళ భక్తులు దీపాలు వెలిగించారు. శివాలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, దేవస్థానం ఆధ్వర్యంలో సంధ్యవేళ శివలింగం, ఓం ఆకారంలో భక్తులు దీపారాధనలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరీశుడి కొండపై స్వయంభువుగా వెలిసిన స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శివాలయంలో పర్వతవర్థిని రామ లింగేశ్వర స్వామివారి ఆలయంలోని స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చక స్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్ఫటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 33,03,170 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్ రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని ఇటలీ దేశస్థులు దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టం ఆగమవుతోంది..



జాతీయ రహదారిపై బారులు తీరిన పత్తి వాహనాలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి పత్తి రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి తాము తెచ్చిన పత్తిని కాదని ఇతరులు తెచ్చిన పత్తి కొనుగోలు చేస్తుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఓ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రంలో తమ కంటే వెనుక తెచ్చిన పత్తినే మొదట కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం పత్తి తీసుకొస్తే సోమవారం సాయంత్రం వరకు కూడా పత్తి మ్యాచర్ చూడ లేదని, తమకంటే వెనుక వచ్చి న డీసీఎం, లారీల్లో కొందరు తెస్తే కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు.

● కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి)

యాదగిరీశుడి బాలాలయ

ఖాళీ స్థలంపై కన్ను

3వ పేజీ తరువాయి..

ప్రకటిస్తారని ఆశించిన భక్తులకు నిరాశే మిగిలింది. ఇప్పటికే పాత ఆచారాల పునరుద్ధరణ పేరుతో డార్మెటరీ హాల్, విష్ణుపుష్కరిణి, కొబ్బరికాయలు కొట్టేస్థలం, కొత్తగా అఖండ దీపారాధన ఇలా ఒక్కొక్కటి కొండపైకి చేరుతుండగా, ఇదే అదునులో దుకాణాలు ఏర్పాటు చేయవచ్చని వర్తకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎలాగైనా ఖాళీ స్థలంలో పాగా వేయాలని వర్తకులు చూస్తున్నట్లు తెలుస్తోంది.

విప్ చుట్టూ వర్తకుల ప్రదక్షిణలు

ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు వర్తకులు కన్నేశారు. ఇదే విషయమై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొండపైన 2026 సంవత్సరంవరకు కోర్టు అనుమతితో 10 దుకాణాలు కొనసాగనుండగా, కొత్తగా మరో 15 దుకాణాలకోసం వర్తకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆలయ అధికారులు ఇక్కడ కల్యాణ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్లనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకోసం 166, వర్తకులకోసం 162 సముదాయాలు వేర్వేరుగా కొండకింద నిర్మించారు. ఇవి రూ.15కోట్ల నిధులు లేమితో 10శాతం పనులు నిలిచిపోయాయి. కొండపైనే వర్తకం చేసుకునేందుకు వర్తకులు మొగ్గు చూపుతుండగా కొండకింద నిర్మించిన గదులు ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం



ప్రభుత్వం మారినందున దాతను కలిసేందుకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నాం. బాలాలయ ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో కల్యాణమండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసేందుకు వీలుపడదు. భక్తుల సౌకర్యార్థం ఇక్కడ కల్యాణోత్సవ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు ఉన్నతాధికారులను సంప్రదిస్తాం.

● భాస్కర్‌రావు, ఈవో, యాదగిరిగుట్ట దేవస్థానం.

గుంతలో పడి.. తల్లడిల్లి

● గుంతలో పడిన గేదె ● ఎక్స్‌కవేటర్ సహాయంతో తీయించిన యజమాని



గూనల్లో పడి ఉన్న గేదె

కొండమల్లేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి నిల్వ కోసం తీయించిన గుంతలో పడి ఓ గేదె తల్లడిల్లింది. అందులోనే ఉండి నరకయాతన అనుభవించింది. గేదె యజమాని విషయం తెలుసుకొని దానిని బయటికి తీయించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎస్‌వీ కాంప్లెక్స్ వెనుక వైపు మురుగు నీటి నిల్వ కోసం గుంత తీయించి గూనలు వేసి ఉంచారు. గుంతపై మూత లేకపోవడంతో సోమవారం రాత్రి ఓ గేదె అందులో పడి అందులో ఉండి పోయింది. సమాచారం తెలుసుకున్న గేదె యజమాని ఎక్స్‌కవేటర్ సహాయంతో గేదెను బయటికి తీయించాడు. గుంతను పూడ్చి ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బెడిసికొట్టిన 'బంపర్' ఐడియా

● కారు వెనుక భాగంలో బంపర్ మధ్యలో గంజాయి ప్యాకెట్లు ● రెండు కేసుల్లో ఏడుగురు ముఠాసభ్యుల అరెస్టు



గంజాయి తరలించేందుకు కారు వెనుకభాగంలో ఏర్పాటుచేసిన అమరికను చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్ల వెనుక భాగం, బంపర్ వద్ద గంజాయి ప్యాకెట్లు ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా తరలిస్తున్న అక్రమార్కుల వ్యూహం బెడిసికొట్టింది. ఈ ఘటనలో రెండు ముఠాల్లోని ఏడుగురు సభ్యులను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టుచేసి, వారినుంచి రూ.28లక్షల విలువైన 1.10క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఖాసిం, కర్ణాటక రాష్ట్రానికి చెందిన హెక్కవాయి విజయ్‌కుమార్, అతని కుమారుడు శుభం కర్ణాటకలోని బీదర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. కర్ణాటకతో పాటు మహారాష్ట్రలో కూడా గంజాయి విక్రయించేవారు. ఖాసీంతో పాటు విజయ్‌కుమార్, శుభం గంజాయి కోసం ఒడిశాకు వెళ్లేవారు. ఈ నెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్లు బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, షేక్ మౌలాలీలతో కలిసి రెండు కార్లలో ఒడిశాకు వెళ్లారు. అక్కడ బచ్చెలి మోహనక్రిష్ణ, ఒడిశాకు చెందిన కోర అచ్చుతరాజు వద్ద 72 కిలోల గంజాయిని కిలోకు రూ.2,500 చొప్పున కొనుగోలు చేశారు. గంజాయిని ప్యాకెట్లుగా మార్చి కారు డిక్కీలో భద్రపరిచారు. అక్కడినుంచి అదే రోజు సాయంత్రం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు విజయవాడ మీదుగా సూర్యాపేట నుంచి హైదరాబాద్ మీదుగా వెళ్లాలని నిర్ణయించుకుని రెండు కార్లలో బయలుదేరారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలో జాతీయ రహదారిపై పట్టణ ఎస్ఐ గోపీక్రిష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కోదాడ వైపు నుంచి రెండు కార్లు వేగంగా వస్తుండటంతో అనుమానం వచ్చి ఆపారు. డ్రైవర్లు పారిపోయే ప్రయత్నంచేయగా, అదుపులోకి తీసుకుని కార్లను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానం రాకుండా కారు వెనక భాగంలో ఉన్న బంపర్ మధ్యలో ప్రత్యేకమైన ఏర్పాటుచేసి అందులో గంజాయి ప్యాకెట్లను ఉంచి బంపర్ డూమ్‌ను యథావిధిగా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఒక కారులో 17 గంజాయి ప్యాకెట్లు, మరో కారులో 8 గంజాయి ప్యాకెట్లు లభించాయి. రెండు కార్లలో కలిపి రూ.18లక్షల విలువైన 72కిలోల గంజాయి లభించింది. నిందితుల నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని..

మహారాష్ట్రకు చెందిన కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసే మీరగాని ప్రభాకర్ గంజాయి పీల్చేందుకు అలవాటు పడ్డాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి సీలేరు మీదుగా భద్రాచలం తరలించి అక్కడ గంజాయి విక్రయించి డబ్బు సంపాదించేందుకు నిర్ణయించుకున్నాడు. ఇలా గంజాయిని తరలిస్తున్న కేసులో పోలీసులకు పట్టుబడిన ప్రభాకర్ రాజమండ్రి జైలు నుంచి ఫిబ్రవరిలో విడుదల అయ్యాడు. జైలులో ఉన్న సమయంలో అక్కడివారి ద్వారా షోలాపూర్‌కు చెందిన దాదా గురించి తెలుసుకుని బయటకువచ్చిన తర్వాత కలుసుకున్నాడు. దాదా చెప్పిన మేరకు గంజాయి లోడుతో సిద్ధంగా ఉన్న కారుతో ఈ నెల 16వ తేదీ పలాస నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో కోదాడ రూరల్ పోలీసులు చిమిర్యాల వద్ద వాహనాలు తనిఖీచేస్తూ రూ.9.25లక్షల విలువైన సుమారు 37.460 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు జి. రవి, మట్టయ్య, సీఐలు గురుకుల రాజశేఖర్, రజితారెడ్డి, శివకుమార్, ఎస్ఐలు అనిల్‌రెడ్డి, గోపీక్రిష్ణ, శ్రీకాంత్‌గౌడ్, నవీన్, సిబ్బంది చనగాని వెంకన్న, గురుస్వామి, జాఫర్, చామకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'హమారా శౌచాలయ్ - హమారా సమ్మన్'

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నుంచి 'హమారా శౌచాలయ్ - హమారా సమ్మన్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై సర్వే పూర్తి చేసి సామూహిక మరుగుదొడ్ల అవసరాన్ని గుర్తిస్తారు. డిసెంబరు 5వ తేదీ వరకు సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు, వ్యక్తిగత మరుగుదొడ్లకు రంగులు వేయడం, లబ్ధిదారులకు మంజూరు లెటర్లు, పారిశుధ్య కార్మికులకు సన్మానం చేయనున్నారు. వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల వాడకంపై ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, మరుగుదొడ్లను శుభ్రం చేసి రంగులను అద్దనున్నారు. డిసెంబరు 10వ తేదీన పరిశుభ్రంగా ఉన్న సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్లను గుర్తించి అవార్డులను అందజేస్తారు.

ఆర్థికాభివృద్ధే మహిళా సమాఖ్య లక్ష్యం

● డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నల్లగొండరూరల్, శాలిగౌరారం, కట్టంగూరు, మాడ్గులపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే మహిళా సమాఖ్య లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు నిర్వహించే ఇందిరా మహిళాశక్తి తెలంగాణ సంబరాలు జిల్లాలో డీఆర్‌డీఏ అండ్ సెర్ప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంఘంలో చేరని మహిళను సంఘంలో చేర్పించి, వారికి ప్రభుత్వం ద్వారా రుణాలు అందించి చిరు వ్యాపారాలను చేసుకునేందుకు ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు చిరు వ్యాపారాలు, శ్రీనిధి ద్వారా గేదెల లోన్లు మంజూరు చేశామన్నారు. కోళ్ల పెంపకం కూడా చేసుకోవాలని సూచించారు. సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పడంపై సంఘాలకు అవగాహన కల్పించారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి లోన్ తీసుకొని చనిపోయిన సభ్యురాలి కుటుంబాలకు లోన్ బీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా సంఘం సభ్యులు లోన్ తీసుకొని ప్రమాదవశాత్తు మృతి చెందితే 18 ఏళ్ల నుంచి 60సంవత్సరాల వరకు ఆ సభ్యురాలి కుటుంబానికి రూ.10లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు వినోద, స్వాతి, సీసీలు, ఇతర మహిళ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్యలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి మాట్లాడారు. మహిళా సంఘాలకు రుణాలు, ప్రమాద బీమా బ్యాంకు కింద ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మోదుగు అండాలు, జమ్ము శ్రీలత, వెలుగు సీసీలు, సమభావన సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏపీఎం కస్వరాజు సైదులు మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి మహిళకు తెలిసే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కడియం రాంమోహన్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తాటిపాముల చైతన్య, సీసీలు కారింగు వెంకన్న, శంకర్, మల్లీశ్వరి, ఇందిర, శాంతి తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తిరుమలస్వామి మాట్లాడుతూ సమాఖ్య ఆధ్వర్యంలో పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, బ్యాంకు లింకేజీ, అమ్మ ఆదర్శ పాఠశాల స్కూల్ యూనిఫాం, అంగన్‌వాడీ పాఠశాలల్లో దుస్తులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, సీసీలు నాగయ్య, సైదులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

నల్లగొండ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం కళాశాల, పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్లుగా ఎంజీయూ చెందిన కె.వి.శశిధర్, అయితరాజు లక్ష్మణ్ వ్యవహరించారు. కళాశాల, పాఠశాల విద్యార్థులను గ్రూపులుగా చేసి క్విజ్ పోటీలను ఆసక్తికరంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన టీమ్‌కు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేయనున్నారు. అదేవిధంగా గ్రంథాలయ సంస్థలో పనిచేసి పదవీవిరమణ పొందిన ఉద్యోగులను, గ్రంథపాలకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, వయోజన విద్య అధికారి నర్సింహారెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి బి.బాలమ్మ, కట్ట నాగయ్య, నిర్మలాదేవి, నర్సింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, వేణుగోపాలచార్యులు, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

పెద్దవూర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 60మంది విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ పెండ్యాల వెంకటేశ్వర్‌రావు సోమవారం టై, బెల్టులు, ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహాయం ఎనలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రామ్‌నాయక్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, మెహజాబి, గులాం ఆజాద్, లావణ్య, అంజుమ్, రమేష్, సైదమ్మ పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీలంతా ఏకం కావాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీ జేఏసీ కన్వీనర్‌గా నియమితులైన గుండెబోయిన నాగేశ్వరరావును సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, నరేష్‌గౌడ్, అంజి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్, మాస భాస్కర్, అంగిరేకుల జగదీష్, భాస్కర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి : ఎమ్మెల్సీ



కాళీకదేవి ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాళికాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో డౌన్ పార్కు వద్ద ఉన్న కాళికాదేవి అమ్మవారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, కౌన్సిలర్ రమేష్‌జీ, కేశవ్ అజ్మీరా, ఆలయ కమిటీ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి మంద రఘువీర్, కోశాధికారి చంద్రమౌళి, శ్రీను, శ్రీనివాస్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లుగౌడ్, యోహాన్, మోహన్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మా ప్రభుత్వ నినాదం



నార్కట్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ నినాదమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని మజీదు వద్ద డ్రైనేజీ నిర్మాణం, ఖబ్రస్తాన్, లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని అవాంతరాలు సృష్టించినా ప్రజల మద్దతుతోనే తాము అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నట్టు సత్తయ్య పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, సిద్దగోని స్వామిగౌడ్, స్రవంతి, సమద్, ప్రజ్ఞాపురం సత్తి, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, బిక్షపతి, యాదయ్య, అజీజ్ పాల్గొన్నారు.

జిల్లాలో కుటుంబపాలన అంతం చేయడమే లక్ష్యం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న వర్షిత్‌రెడ్డి

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుటుంబపాలన అంతం చేయడమే తన లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షు డు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై హైదరాబాద్‌లోని వేద ఫంక్షన్ హాల్‌లో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. డిసెంబరు 1 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు జరిగే యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను అమలుచేయడంలో విఫలమైన ప్రభుత్వ వ్యతిరేకతను ఎండగడతామన్నారు. అదేవిధంగా జిల్లాలో కాంగ్రెస్ నాయకులు కుటుంబపాలన చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారన్నారని ఆరోపించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిట్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ అన్నారు. చిట్యాల పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను సోమవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభల్లో రానున్న రెండేళ్లలో విద్యారంగ అభివృద్ధి కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన నార్కట్‌పల్లిలో జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్థానిక ఎంఈవో సైదానాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం గోగికార్ మాధవి, కుకుడాల గోవర్ధన్‌కు మహాసభల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొప్పని యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఏశమల్ల నాగయ్య, నాయకులు దాసరి శ్రీరాములు, రంగా రామలింగయ్య, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై యూఎస్‌ఎఫ్ఐ పోరాటం

దేవరకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై యూఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కలమూరి పరశు రాం అన్నారు. దేవరకొండలో యూఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. విజయవాడలో డిసెంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న యూఎస్ఎఫ్ఐ మొదటి అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు మహమ్మద్ సౌబాన్, రమేష్, నిరంజన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలి



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలో పాల్గొన్న దివ్యాంగులు

నల్లగొండటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.4 నుంచి రూ.6 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు పింఛన్ల పెంపుతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 2016 దివ్యాంగుల చట్టం అమలు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 5శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అదేవిధంగా దివ్యాంగుల శాఖను స్వతంత్ర శాఖగా గుర్తించాలన్నారు. లేనిచో ఈ నెల 26వ తేదీన దివ్యాంగుల మహాగర్జనను నిర్వహిస్తామని హెచ్చరించారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ రిలే దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీనివాస్, తగుళ్ల వెంకన్న, సైదులు, కలసిరెడ్డి చేతన్‌రెడ్డి, శంకర్, బొడ్డు సైదులు, ఇంద్రకంటి నగేష్, యాదగిరి, వెంకన్న, లక్ష్మి, నగేష్, నాగార్జున రవి తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా రథసేవ

నకిరేకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడవ రోజు వాసవీమాత అమ్మవారి రథసేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై పూజలు నిర్వహించారు. హాజరయ్యారు. ఈ నెల 20వ తేదీన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గర్రె రాంమూర్తి వెంకటలక్ష్మి, బ్రహ్మదేవర విశ్వనాథం అరుణ, బ్రహ్మదేవర లక్ష్మయ్య సువర్ణ, బ్రహ్మదేవర పద్మ కృష్ణమూర్తి, గర్రె వెంకన్న, శ్రీనివాస్, వీర్లపాటి రాంబాబు, బ్రహ్మదేవర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల భవిష్యత్తు కోసం పోరాటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదిగల భావితరాల భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాదిగ గ్లోబల్ ఫెడరేషన్ ఛైర్మన్ కత్తుల జగన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలోని ఈ నెల 23వ తేదీన ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. సదస్సుకు రాష్ట్రంలోని మాదిగ ఎమ్మెల్యేలంతా హాజరు కానున్నట్లు తెలిపారు. మాదిగలంతా పార్టీలకతీతంగా సదస్సుకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ ఐక్యవేదిక నాయకులు కత్తుల తులసీదాస్, నాగుల నర్సింహ, బకరం శ్రీనివాస్, సైనం శ్రీనివాస్, బొజ్జ రాబర్ట్, బొజ్జ శంకర్, పెరిక రమేష్, కందుల లక్ష్మయ్య, పెరిక అంజయ్య, తొలకొప్పుల గిరి, దాసరి జానయ్య, మధు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు మార్చి

(3వ పేజీ తరువాయి)

పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్ కూడా పొందారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన ధరణి పాస్‌బుక్ కూడా ఈ భూమికి స్వరూప యజమానురాలిగా గుర్తిస్తూ జారీ అయింది. అయితే ఈ భూమి సరిహద్దుల్లో ఉండే బోధనపు వెంకటరెడ్డికి చెందిన సర్వేనెంబర్ 43, 44లోనే ఇతర సబ్‌డివిజన్ల నెంబర్లలో ఉన్న 1.10 గుంటల భూమితో పాటు, స్వరూపకు చెందిన 44/ఆలో ఉన్న 18 గుంటల భూమిని 2012, మే 10న సాదాబైనామా ద్వారా అదే గ్రామానికి చెందిన బోధనపు సత్తిరెడ్డి కొనుగోలు చేశారని, నల్లగొండ తహసీల్దార్ కార్యాలయం నుంచి 8.7.2018న బీ/458/2018 నెంబర్ ద్వారా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 31-బీ ఫారమ్ ద్వారా ఈ బదిలీ సక్రమమేనని నిర్ధారిస్తూ అప్పటి తహసీల్దార్ కార్యాలయం ద్వారా ఈ భూమిని సత్తిరెడ్డి పేర రికార్డుల్లోకి మార్చారు. దీంతో విషయం తెలుసుకున్న స్వరూప తాను ఎవరికీ భూమి విక్రయించలేదని, ఇదంతా తహసీల్దార్ కార్యాలయపు అధికారులు, ఉద్యోగులతో కలిసి అక్రమంగా సాదాబైనామా సృష్టించి తనకు అన్యాయం చేశారని, ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ మొదలుకొని కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసింది. తాజాగా ఈ నెల 4వ తేదీన కూడా ఆమె కలెక్టర్‌కు మరోదఫా ఫిర్యాదు చేసింది.

ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపి బాధ్యులైన వారిపై, తప్పుడు రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులుపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని స్వరూప కోరింది. ఈ విషయమై నల్లగొండ తహసీల్దార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ నిమిత్తం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

బ్రహ్మంగారి గుట్టపై ముడుపుల దహనం

● వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన భక్తులు

నల్లగొండ క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న బ్రహ్మంగారి గుట్ట ప్రతిష్టను కొంత మంది దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతూ అరాచకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గుట్టపై ఉన్న శ్రీ శివ సమేత కనకదుర్గ అమ్మవారి ఆలయం ఎంతో పేరుగాంచింది. భక్తులు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో తమ కోర్కెలు తీర్చుకునేందుకు కట్టిన ముడుపులను ఈ నెల 16వ తేదీన కొంత మంది దుండగులు దహనం చేశారు. గమనించిన భక్తులు ఈ విషయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

గురుకుల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కొండమల్లేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా పోలే చంద్రశేఖర్ ఎన్నియ్యారు. సోమవారం గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ శౌరి అధ్యక్షతన 2024-2025 విద్యా సంవత్సరానికి నూతన పేరెంట్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలే చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కంబాలపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రటరీగా ధనమ్మ, ట్రెజరర్‌గా సురేష్, జాయింట్ సెక్రటరీగా సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పులిజాల ముత్యాలు, ఆర్.యాదయ్య, కృష్ణవేణి, ఎర్ర ఆంజనేయులును ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం : సీపీఎం

చింతపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యావని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండలంలోని కుర్మపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల కార్యదర్శిగా గ్రామానికి చెందిన ఉడుగుంట్ల రాములును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పోలే యాదయ్య, సర్దార్, అరేకంటి పెద్దులు, లక్ష్మమ్మ, పోలోజీ బ్రహ్మం, బడారి బాలయ్య, మోహన్, చలచీమల కోటేష్, లారి కృష్ణయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

మిర్యాలగూడరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న త్రిపురారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎఫ్‌డీవై నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎఫ్‌డీవై జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశి, వస్కుల కిరణ్ మాట్లాడుతూ త్రిపురారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్లు విద్యార్థులు హోంవర్క్ చేయలేదని విద్యార్థులను తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. పదో తరగతి పరీక్షకు రూ.3వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్మానియేల్, సుజందర్, ప్రశాంత్, రమేష్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని కాపాడండి

● వెంచర్‌దారుల నుంచి రక్షించాలని కలెక్టర్, ఎస్పీకి చర్లపల్లి వృద్ధ దంపతుల వినతి



విలేకర్లతో మాట్లాడుతున్న సోమయ్య, అంజమ్మ

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెంచర్‌దారుల ఆక్రమణ నుంచి తమ భూమిని కాపాడాలని నల్లగొండ సమీపంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన ఎలిజాల సోమయ్య, అంజమ్మ కోరారు. సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు వినతిప్రతాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. చర్లపల్లిలోని 620, 634, 635, 636 సర్వే నెంబర్లలో ఉన్న తమ మూడు ఎకరాల భూమిని కొందరు వెంచర్‌దారులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో 30 సంవత్సరాల క్రితం భూమిని కొనుగోలు చేసి సేద్యం చేసుకుంటున్నామని తెలిపారు. తమ భూమిని ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న తమపై దాడి చేశారని అన్నారు. దాడి సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వెంచర్ చేయడానికి తమ భూమి అమ్మాలని ఒత్తిడి చేయగా విక్రయించలేదని భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి ఆక్రమించడం తప్పుని గ్రామ పెద్దలు చెప్పినా వారు వినడం లేదని, తమ భూమితో పాటు కాల్వను ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీపీఐ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

కనగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో నిర్వహించే సీపీఐ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి కోరారు. సోమవారం కనగల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలో డిసెంబరు 30వ తేదీన భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకాలతో జిల్లాలోని ఇతర పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించాలన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ, రైతుబంధు డబ్బులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, నాయకులు దోటి పాండారి, నాగయ్య, బోగరి రాంకోటి, లచ్చయ్య, జానయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

దేవరకొండలో కార్తీక సోమవారం పూజలు

దేవరకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో కార్తీకమాసం మూడవ సోమవారాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. పట్టణంలోని నందీశ్వర ఆలయం, శివాలయం, మార్కండేయస్వామి, వేంకటేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు వెళ్లి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు ఉపవాస దీక్షలు చేశారు.

సర్వేను పొడిగించాలి

శాలిగౌరారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే మరో వారం రోజులు పొడిగించాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు దాసరి దేవ చిత్తం కోరారు. మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కూలీ పనులు చేసుకునే ప్రజలు ఇంటి వద్ద ఉండటం లేదని, అలాగే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఇంకా రాలేదని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో కొన్ని ఇళ్లకు స్టిక్కర్లు కూడా అంటించలేదని అన్నారు. ఇల్లు లేని వారు పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. సర్వేను ఈ నెల చివరి వరకు సర్వేను పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి లింగయ్య, మక్క బుచ్చిరాములు, గద్దపాటి అరవింద్, జూలూరి శేఖర్‌ల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

డిండి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మైనుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రెండు కోఆపరేటివ్ సొసైటీల పరిధిలో 13ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం నాలుగు మాత్రమే ప్రారంభించారని, మరో 9 కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ వానాకాలం డిండి ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు మండలంలో 20 వేల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్‌ను కూడా రైతులకు కల్పించాలని అన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా జనార్ధన్

వేములపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా అంకెపాక జనార్ధన్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు అందించాలని, ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ అమలు చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో సోమవారం మలక్‌పేట యశోద ఆస్పత్రి డా.భానుతేజారెడ్డి ఆధ్వర్యంలో 60 మంది పెన్షనర్లకు బీపీ, షుగర్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్, వైద్య బృందం పెన్షనర్ల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్గనైజర్ ఎండీ. సాజిద్‌హుస్సేన్, శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలుకా అధ్యక్షుడు గజవెల్లి సత్యం, ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకట్‌రెడ్డి, జెల్లా శ్రీశైలం, ఆంజనేయులు, శంకర్ రెడ్డి, రమేష్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.